
సాక్షి
ఖమ్మం
సోమవారం ; 8 ; జూలై ; 2024



ఆషాఢం.. ఆధ్యాత్మికం

ఆషాఢ మాసంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అమ్మవార్లకు బోనాల సమర్పణతో ఆలయాలు సందడిగా మారుతాయి. 10లో



ఈజీఎస్‌లో ఎఫ్‌ఏల మాయలు..

ఉపాధి హామీ పనులకు హాజరు కాకున్నా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు మస్టర్లు వేస్తూ నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం చల్లగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌లో తండ్రీకొడుకుల ఉత్తీర్ణత



ఉత్తీర్ణత సాధించిన రవికిరణ్, మైఖేల్

కామేపల్లి: గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షలో తండ్రీ కొడుకులు ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఖమ్మం పట్టణానికి చెందిన దాసరి రవికిరణ్ కామేపల్లి మండలం ఎంజే పల్లి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా పని చేస్తున్నారు. అయనతో పాటు కుమారుడు మైఖేల్ ఇమ్మానియేల్ కూడా గ్రూప్‌–1 ప్రిలిమ్స్ రాసి మెయిన్స్‌కు ఒకేసారి అర్హత సాధించారు. గ్రూప్‌–1 పరీక్షలకు సిద్ధమవుతున్న కుమారుడికి సహకారం అందిస్తూ, సలహాలు, సందేహాలు తీరుస్తూ తండ్రి కూడా ప్రిలిమ్స్ రాశారు. రిజర్వేషన్ కోటాలో ఐదేళ్లు, ఇన్ సర్వీస్ కోటాలో ఐదేళ్లు మినహాయింపు ఉండడంతో 53 ఏళ్ల వయసులోనూ రవికిరణ్ గ్రూప్‌–1 మెయిన్స్‌కు అర్హత సాధించడం విశేషం.

నేడు ఘనంగా వైఎస్ జయంతి వేడుకలు

ఖమ్మంవన్‌టౌన్: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను డీసీసీ కార్యాలయంతో పాటు ఖమ్మం, కూసుమంచిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ వేర్వేరు ప్రకటనలు చేశారు. పార్టీ నాయకులు, వైఎస్ అభిమానులు భారీగా హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

ఖమ్మం స్పోర్ట్స్/రఘునాథపాలెం : జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం వీవీపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఇల్లందు, సత్తుపల్లి, మణుగూరు తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 12, 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సంఘం అధ్యక్షుడు కె.ఈ సెల్యూకాస్, కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఎంపికల ప్రక్రియలో పీడీలు కృష్ణయ్య, శ్రీదేవి, అశ్రిత, సాయి, గోపీచంద్, శివ, గోపి పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో శృతి, జస్మిత, చరిత, హారిక, జయశ్రీ, అనిత, ఎం.తనుశ్రీ, పి.తనుశ్రీ, శరణ్య, లతిక, హారిని, రేణుక, కీర్తి, యమున, ఉమాశ్రీ, కె.ధనవర్ష్, యోషిత, మీరాకుమారి, బి.శిల్ప ఉన్నారు. జట్టు మేనేజర్‌గా నోయల్ జాక్సన్ వ్యవహరిస్తారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తమ్మినేని

ఖమ్మంఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం పోరాడుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెంలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు ఎర్రా శ్రీకాంత్, ఎస్‌కెమీరా, గోవింద్, ఉపేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారికి ఆదివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశాక స్వామివారికి కంకణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుక నిర్వహించారు.

లక్ష్యానికి దూరమే..

- ఈ ఏడాది జిల్లాలో పత్తి సాగు అంచనా 2,01,834 ఎకరాలు
- ఇప్పటివరకు సాగు చేసింది 1,81,794 ఎకరాలే..
- విత్తనాలకు ముగుస్తున్న కాలం
- పంట సాగుపై ధర, దిగుబడి ప్రభావం



తొలకరికి ముందు పొడి దుక్కుల్లో వేసిన పత్తి



పత్తి చేలో పాటు చేస్తున్న రైతు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది పత్తి సాగు లక్ష్యానికి దూరంగా ఉంది. జిల్లాలో ప్రధాన పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. వరి 2.83 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, పత్తి 2.20 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. అయితే వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది పత్తి సాగు అంచనాను 2,01,834 ఎకరాలకు తగ్గించారు. అయినా ఆ లక్ష్యం మేరకు కూడా నెరవేరడం ప్రశ్నార్థకంగానే మారింది. విత్తనాలు వేసే సమయం ముగిసేందుకు వస్తున్నా శనివారం నాటికి 1,81,794 ఎకరాల్లో మాత్రమే సాగైనట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. అంటే అంచనాలోనూ 20 వేల ఎకరాల్లో వెనుకబాటే ఉంది. తొలకరి వర్షాల సమయంలోనే పత్తిని అధికంగా విత్తుతారు. అంతేగాక తొలకరి వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రాంతాల్లో పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేస్తారు. ప్రధానంగా నల్లరేగడి నేలల్లో పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేస్తారు. ఇతర నేలల్లో మాత్రం దుక్కులు సిద్ధం చేసి ఓ మోస్తరు వర్షం కురిసిన తర్వాతే విత్తుతారు.

సమయం ముగుస్తోంది..

సాధారణంగా మే లో కురిసే అకాల వర్షాలకు దుక్కులు సిద్ధం చేస్తారు. ఆ తర్వాత మే చివరి, జూన్ మొదటి వారాల్లో కురిసే వర్షాలు, రుతుపవనాల ద్వారా కురిసే వానలకు పత్తిని విత్తుతారు. పంటల కాలంలో తొలుత వేసే పంటల్లో పత్తి ఒకటి. జూన్ ఆరంభం నుంచి తొలి 20 రోజుల్లోనే ఈ విత్తనాలు వేస్తారు. వానలు వెనకబడితే మరో 10 – 15 రోజుల పాటు వరకు విత్తుతుంటారు. వ్యవసాయ శాఖ మాత్రం జూలై 15 లేదా 20 వరకు పత్తిని సాగు చేసుకోవచ్చని రైతులకు సలహాలు ఇస్తోంది. అయితే జూలైలో అధిక వర్షాలు కురిస్తే మెట్ట భూముల్లో పత్తి విత్తడం సాధ్యం కాదు. దీంతో జూలైలో పత్తి సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. అంతేగాక పత్తి సాగు చేసే రైతులు గత రెండు మూడేళ్లుగా ఆయా నేలల్లో రెండో పంటగా మొక్కజొన్న వేస్తున్నారు. ఈ పంట సాగు కోసం పత్తిని ముందుగానే సాగు చేసేలా జూన్‌లోనే విత్తుతుంటారు

ధర, దిగుబడి ప్రభావం..

పత్తి సాగుపై ధర, దిగుబడి ప్రభావం చూపుతోంది. దీనికి తోడు నీటి వనరులున్న ప్రాంతాల్లో మిర్చి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 2022–23 సంవత్సరంలో పత్తి ధర ఓ దశలో రూ.13 వేలు పలికింది. 2023–24 సంవత్సరం ఆరంభంలో రూ.10 వేలున్న ధర పంట చేతికందే సమయానికి సగటున రూ. 6 వేలకు మించలేదు. గతేడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ. 7,020గా నిర్ణయించగా, ఈ ఏడాది మరో రూ. 501 పెంచి రూ. 7,521గా నిర్ణయించింది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అతివృష్టి, అనావృష్టి ప్రభావం పంట దిగుబడిపై పడుతోంది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఎకరాకు సగటున 10 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 5 క్వింటాళ్లకు మించడం లేదు. ఓ వైపు ధర లేక, మరో దిగుబడులు లేకపోవటంతో పంట సాగు విస్తీర్ణంపై ప్రభావం పడుతోంది.

మధిర డివిజన్‌లో సాగు ఎక్కువ..

జిల్లాలోని మధిర వ్యవసాయ డివిజన్‌లో అధికంగా 71,848 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. చింతకాని, బోనకల్, మధిర, ముదిగొండ మండలాల్లో అధిక విస్తీర్ణంలో విత్తనాలు వేశారు. వైరా డివిజన్‌లో 44,540 ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా, కొణిజర్ల మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో వేశారు. ఖమ్మం డివిజన్‌లో 23,713 ఎకరాల్లో సాగు చేస్తుండగా, రఘునాథపాలెం మండలంలో అధికంగా వేశారు. కూసుమంచి డివిజన్‌లో 32,347 ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లోనే అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అత్యల్పంగా సత్తుపల్లి డివిజన్‌లో 9,346 ఎకరాల్లో సాగు చేస్తుండగా ఈ డివిజన్‌లో తల్లాడ మండలంలో అధిక విస్తీర్ణంలో వేశారు. మొత్తంగా గతేడాది 2.21 లక్షల్లో పత్తి సాగు విస్తీర్ణం ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 1.81 లక్షల ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. ఇందులోనూ ఇటీవల చోటు చేసుకున్న బెట్ట పరిస్థితులతో అక్కడక్కడా విత్తనాలు మొలకెత్తలేదు. ఆయ భూముల్లో రైతులు మళ్లీ విత్తనాలు వేస్తున్నారు.

మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

మండలం	సాగైన విస్తీర్ణం
చింతకాని	19,609
బోనకల్	17,346
మధిర	13,147
ముదిగొండ	11,916
ఎర్రుపాలెం	9,830
కొణిజర్ల	14,506
ఏన్కూరు	10,623
సింగరేణి	17,207
వైరా	2,204
తల్లాడ	5,562
కల్లూరు	1,770
పెనుబల్లి	1,331
వేంసూరు	563
సత్తుపల్లి	120
రఘునాథపాలెం	13,939
కామేపల్లి	9,152
ఖమ్మం అర్బన్	622
ఖమ్మం రూరల్	9,523
కూసుమంచి	8,076
నేలకొండపల్లి	3,026
తిరుమలాయపాలెం	11,722
మొత్తం	1,81,794

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముదిగొండ మండలంలో భట్టి విస్తృత పర్యటన

ముదిగొండ : మండలంలోని పలు గ్రామాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం పర్యటించారు. సుమారు రూ.32 కోట్లతో నిర్మిస్తున్న వల్లాపురం–గంధసిరి, అమ్మపేట, గంధసిరి–పెద్దమండవ, బాణాపురం–గంధసిరి, మల్లారం – వల్లభి బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వల్లాపురంలో మొక్కలు నాటారు. మల్లారంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ గ్రామాల్లో భట్టికి ఘనంగా స్వాగతం పలకగా.. పలువురు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంగా కేసులో ఇరికించారు

చింతకాని : ప్రొద్దుటూరులో రైతు ప్రభాకర్ ఆత్మహత్య ఘటనలో తమను అన్యాయంగా కేసులో ఇరికించారని మత్స్య కార్మికుల కుటుంబసభ్యులు భట్టి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కాంగ్రెస్ నాయకుడు కూరపాటి కిషోర్ నివాసంలో మత్స్య కార్మికుల కుటుంబసభ్యులతో భట్టి విక్రమార్క మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని వారు భట్టిని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, అంబటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వల్లాపురంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

- సీపీకి బీఆర్‌ఎస్ నేతల వినతి
- ప్రొద్దుటూరులో ప్రభాకర్ కుటుంబానికి పరామర్శ
- ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో రైతుకు కూడా..

చింతకాని/కారేపల్లి/ఖమ్మం వైద్యవిభాగం : చింతకాని మండలం ప్రొద్దుటూరులో రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధులు సీపీ సునీల్‌దత్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులో ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.2లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభాకర్‌కు చెందిన పట్టాదారు పాస్ పుస్తకం ఉన్నా కొందరు మత్స్య కార్మికులు ధ్వంసం చేశారని తెలిపారు. భూ వివాదంపై ఆయన రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని విమర్శించారు. అనంతరం.. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన రైతు పచ్చిపాల భద్రయ్యను ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భద్రయ్య పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని భావోద్వేగానికి గురయ్యారు. రైతుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం పోరాడుతూ అన్నదాతలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, ఆర్‌జేసీ కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, నాయకులు బిచ్చాల తిరుమల్ రావు, పగడాల నరేందర్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం మండలాల అధ్యక్షులు బెల్లం వేణు, వీరునాయక్, బాషబోయిన వీరన్న, లింగనబోయిన సతీష్ పాల్గొన్నారు.



ఖమ్మంలో చికిత్స పొందుతున్న రైతు భద్రయ్యను పరామర్శిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి తదితరులు



ప్రభాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

ఖమ్మం సహకారనగర్: గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతుల కోసం ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఆ శాఖ ఉన్నతాధికారులు ఇంకా షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయి పదోన్నతులతో పండగ వాతావరణాన్ని తలపిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖలో అప్‌గ్రేడ్ కాకపోవడం బాధాకరమన్నారు. 31 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చావా రవి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యారోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ రాజేశం

ఖమ్మంవైద్యవిభాగం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు వ్యాప్తి చెందక ముందే చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రాజేశం సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, డయేరియా లాంటి వ్యాధులు రాకుండా చేపడుతున్న చర్యల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమం, దోమ పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు, చికిత్సలు చేయాలన్నారు. వ్యాధులను అరికట్టేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సైదులు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా జిల్లాలో చేపడుతున్న నివారణ కార్యక్రమాలను వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నివారణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడొచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాం, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజేశం

జిల్లా వాసికి డాక్టరేట్

ఖమ్మంవైద్యవిభాగం: ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించిన జిల్లాకు చెందిన రామడుగు వీరభద్రాచారికి ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ అందించనున్న డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఖమ్మంలోని వీడీఓస్ కాలనీకి చెందిన వీరభద్రాచారి పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన 430 మంది సురక్షిత కాన్పులకు వైద్య సేవలు అందించారు. ఈనెల 20న ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ వారిచే న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం చేయనున్నారు.



వీరభద్రాచారి

నేను ప్రజల మనిషిని..

సీపీఎం, మాస్‌లైన్ నేతలతో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీల నేతలతో సమావేశమయ్యారు. తన విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను ప్రస్తుతం కాంగ్రెస్ వ్యక్తిని కాదని, ప్రజల మనిషినని అన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ కూడా ప్రజా సమస్యలపైనే మాట్లాడుతున్నారని, పార్లమెంట్‌లో బలమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. కాగా, రఘురాంరెడ్డికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఘనంగా సత్కరించగా, మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు సాదరంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కొప్పుల చంద్రశేఖర్‌రావు, మిక్కిలినేని నరేందర్, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, సుబ్బారావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, డాక్టర్ భారవి, రాయల చంద్రశేఖర్, గుర్రం అచ్చయ్య, పుసులూరి నరేందర్, ఆవుల వెంకటేశ్వర్లు, సి.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, బండెల వెంకయ్య, ఆర్.శివలింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, టి.ఝాన్సీ, తిమ్మిడి హనుమంతరావు, రాయల రవికుమార్, రామారావు, కేలోత్ లక్ష్మణ్, ఎస్ అజాద్, పి రామదాసు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌వీ రాకేష్, వి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రఘురాంరెడ్డిని సత్కరిస్తున్న నున్నా నాగేశ్వరరావు

మూడు ముక్కలాట

- భద్రాచలం పంచాయతీని మూడు, సారపాకను రెండుగా విభజన
- పంచాయతీరాజ్ చట్ట సవరణను ఆమోదించిన గవర్నర్
- ఇక ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే
- ఐదేళ్లుగా పాలకవర్గం లేక కుంటుపడిన అభివృద్ధి

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు: పంచాయతీరాజ్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం తెలపడంతో భద్రాచలం, సారపాకల పంచాయతీల విభజనకు మార్గం సుగమమైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు పంచాయతీలుగా, సారపాక మేజర్ గ్రామపంచాయతీని రెండు పంచాయతీలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేస్తూ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపింది. అప్పటి గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో బిల్లు పెండింగ్‌లోనే ఉంది. కాగా రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా, సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కలిసి పెండింగ్ బిల్లులను ప్రస్తావించగా, ఆయన పంచాయతీరాజ్ బిల్లుతో పాటు మరికొన్ని ఆమోదించారు. దీంతో విభజన పూర్తికానుంది.

హైకోర్టును ఆశ్రయించడంతో కదలిక

భద్రాచలాన్ని గ్రామ పంచాయతీగానో, మున్సిపాలిటీగానో తేల్చి ఎన్నికలు నిర్వహించాలని స్థానిక ఆదివాసీ నాయకుడు సోందె వీరయ్య గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం భద్రాచలం పంచాయతీ సమస్యను తేల్చాలని నాటి రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ జీఓ నంబర్‌ను 45ను విడుదల చేసింది. కాగా జీఓ నంబర్ 45ను స్థానికులతోపాటు పలు పార్టీలు, కొన్ని ఆదివాసీ సంఘాలు వ్యతిరేకించాయి. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించొద్దని అప్పటి భద్రాచలం(కాంగ్రెస్) ఎమ్మెల్యే పొదెం వీరయ్య గవర్నర్‌ను, పంచాయతీరాజ్ శాఖ మంత్రిని కలిసి విన్నవించారు. ప్రస్తుతం రాష్ట్రం అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్న నేపథ్యంలో పంచాయతీల విభజన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆ ఐదు పంచాయతీలు వచ్చేనా..?


ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం డివిజన్‌లో ఉన్న కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. అనంతరం కొద్ది రోజుల్లోనే కన్నాయిగుడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక గ్రామాలను కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేశారు. దీంతో భద్రాచలం పట్టణం మినహా ఇతర ప్రాంతాలన్నీ ఏపీలోకి వెళ్లాయి. అయితే ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని అక్కడి ప్రజలతోపాటు భద్రాచలం ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పంచాయతీల్లో తీర్మానాలు చేయడంతోపాటు పలుమార్లు ఆందోళనలు కూడా చేపట్టారు. ఇదే విషయమై భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాగా శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ అనంతరం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ అనేక అంశాలకు సంబంధించి కమిటీలు వేశామని, ఆ కమిటీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్న విషయం విదితమే.

భద్రాచలం పంచాయతీ

భద్రాచలాన్ని భద్రాచలం, సీతారాం నగర్, శాంతినగర్ పంచాయతీలుగా విభజించారు. భద్రాచలంలో 21 వార్డులు, సీతారాంనగర్‌లో 17, శాంతినగర్‌లో 17 వార్డులను ఏర్పాటు చేశారు.

సారపాకలో...

పారిశ్రామిక ప్రాంతమైన సారపాక మేజర్ గ్రామ పంచాయతీలో జాతీయ రహదారికి ఒకవైపు సారపాక, మరోవైపు ఐటీసీ పంచాయతీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సారపాక పంచాయతీలో 17, ఐటీసీ పంచాయతీలో 15 వార్డులను ఏర్పాటు చేశారు. పంచాయతీల విభజనకు మార్గం సుగమం కావడాన్ని కొందరు హర్షిస్తుండగా, మరి కొందరు అసంతృప్తితో ఉన్నారు.



భద్రాచలం పట్టణ వ్యూ

క్లుప్తంగా

ఖమ్మంవాసికి ఫ్రాన్స్ బ్యాడ్మింటన్ టోర్నీ టైటిల్


ఎం.తరుణ్

ఖమ్మం స్పోర్ట్స్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో ఖమ్మంకు చెందిన ఎం.తరుణ్ టైటిల్ సాధించడం విశేషం. ఫ్రాన్స్ దేశంలోని సెయింట్ డెన్నిలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ ఈ నెల 3 నుంచి 7 వరకు కొనసాగింది. ఈ టోర్నీలో తరుణ్–యాదాయి ఓకిమెటోపై నెగ్గి బ్యాడ్మింటన్ విజేతగా నిలిచాడు.దీంతోజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్షుడు తమ్మినేని వెంకట్రావు, కార్యదర్శి ఎస్.ఉప్పల్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్‌రావు, తరుణ్ తండ్రి సతీష్, మాజీ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు పి.రవిమారుత్, పి.యుగంధర్, నల్లమోతు రఘు, డాక్టర్ ఎస్.సత్యనారాయణమూర్తిలు తరుణ్‌ను అభినందించారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఒకటి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లేదా కళాశాలల్లో చదివే తండ్రి లేని అనాథ ముస్లిం విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జకాత్ చారిటబుల్ ట్రస్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చెందిన అర్హులైన వారు విద్యార్థి ఆధార్‌కార్డు, పాస్ ఫొటో, తల్లి ఆధార్ కార్డు, తండ్రి మరణ ధ్రువీకరణపత్రం, బ్యాంక్ అకౌంట్, గత ఏడాది ప్రొగ్రెస్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులతో పాటు బోనఫైడ్ ఒరిజినల్ సర్టిఫికెట్ (2024–25)లను ఈనెల 28 కల్లా అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 98665 56876 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అత్తవారింటి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన షేక్.జుబేరియా (21)కు అదే గ్రామానికి చెందిన నజీర్‌తో గత మూడేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల కాలంలో నజీర్ ఇతర మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈవిషయంలో జుబేరియా అత్త బేగం, ఆడపడుచులు పర్వీన్, ఆసీన్‌లకు భర్త వేధింపుల గురించి చెప్పుకోగా.. వారు కూడా నజీర్‌కు సపోర్టుగా ఉండి వేధించేవారు. దీంతో భర్త, అత్త, ఆడపడుచుల వేధింపులు తట్టుకోలేక ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయమై బాధితురాలి తండ్రి ముస్తఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

పెళ్లికి నిరాకరించాడని యువతి..

చర్ల: గత నాలుగేళ్లుగా ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుదునూరు గ్రామ పంచాయతీ బోటిగూడెం గ్రామానికి చెందిన కొర్సా సరోజిని (23), కలివేరు గ్రామానికి చెందిన రాజేష్‌లు గత నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో యువతి పెళ్లి చేసుకుందామంటూ యువకుడిని కోరగా.. యువకుడు నిరాకరించడంతో మనస్తాపం చెందిన సరోజిని శనివారం సాయంత్రం బోటిగూడెంలోని ఇంటి వద్ద పురుగుమందు తాగింది. దీంతో కుటుంబసభ్యులు సత్యనారాయణపురం ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తల్లి మాణిక్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన హరికృష్ణ అనే యువకుడు ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మం తరలించారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

మెడికల్ బోర్డ్ దందాలో ఉద్యోగి సస్పెన్షన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ విభాగంలో సెక్యూరిటీ విభాగానికి చెందిన రమేష్‌కుమార్ సస్పెన్షన్‌కు గురైనట్లు విడుదలైన ప్రకటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సెక్యూరిటి విభాగంలో పనిచేసే రమేష్‌కుమార్, భూపాలపల్లి ఏరియాలోని కేటీకే–1 ఇంక్‌లైన్‌లో పనిచేసే బానోత్ హరిసింగ్ అనే కార్మికుడి విషయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియలో మధ్యవర్తిగా వ్యవహరించి ఆయన కుమారుడైన బానోత్ తులసీరామ్ నుంచి రూ.2.50 లక్షలు వసూలు చేసినట్లు సమాచారమని సింగరేణి విజిలెన్స్ విచారణలో తేలింది. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించి కంపెనీ ప్రయోజనాలకు విఘాతం కలిగించినందుకు జరిమానాతో పాటు సస్పెన్షన్ విధిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల మాయలు

ఏకంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పేర్లపై మస్టర్లు

- తూతూ మంత్రంగానే అధికారుల పర్యవేక్షణ
- విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం
- ఎమ్మెల్యే లిఖిత పూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టకుండా జాప్యం



బర్లగూడెంలో ఈజీఎస్ పనుల్లో పాల్గొన్న కూలీలు(ఫైల్)

కామేపల్లి: ఆర్థిక సంవత్సరంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబంలో కనీసం ఒక సభ్యుడికి 100 రోజుల ఉపాధి పని దినాలు అందించాలనే లక్ష్యంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి భద్రతను పెంచడం, పేదరికాన్ని నిర్మూలించేందుకు వీలవుతోంది. అయితే ఈ పథకం అమలులో అవినీతికి చోటుచేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ పథకంలో మాత్రం అవినీతి దొర్లుతూనే ఉంది. ఎంతలా అంటే ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఈజీఎస్ పనులకు హాజరై వారం వారం వారి ఖాతాల్లో పనికి తగిన వేతనం అందుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ల మాయాజాలం..

మండలంలోని బర్లగూడెం, పాన్నేకల్ గ్రామాల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన కొంతమంది ఆయా గ్రామాల్లో ఈజీఎస్ పనులకు హాజరైనట్లు, వారి ఖాతాల్లోనూ ఉపాధి డబ్బులు పడినట్లు మస్టర్లు వేస్తున్నారు. దీని అంతటికి ప్రధాన సూత్రధారి స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ అంటూ ఆయా గ్రామాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. ఈ విషయంపై ఇటీవల గ్రామస్తులు కొంతమంది జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చివరకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు పది రోజుల క్రితమే ఎమ్మెల్యే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు చేసి పది రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఎటువంటి విచారణ చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

వారానికి వంద.. చెరి సగం..

ఈజీఎస్ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఓ కొత్త పంథాకు తెరలేపారు. ఈజీఎస్ పనికి హాజరైన కూలీలకు పని చేసినా.. చేయకున్నా కనీస వేతనం పడేలా ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలు ఏకంగా చక్రం తిప్పి కొలతలు తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక వారానికి రూ.100 చొప్పున ఇస్తే చెరి సగం డబ్బులు తీసుకోవచ్చనే ఆశ చూపిస్తుండడంతో ఈజీఎస్ సిబ్బంది వారంలో రూ.లక్షలు గడిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఈజీఎస్ పనులపై స్పెషల్ ఆడిట్ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

విచారణ చేపడతాం..

బర్లగూడెం గ్రామంలో ఈజీఎస్ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలు పాల్పడినట్లు స్థానికులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాను. త్వరలోనే విచారణ చేపడతాం.

– రవీందర్, ఎంపీడీఓ, కామేపల్లి

వైభవంగా జగన్నాథ రథయాత్ర


జగన్నాథస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) కొలువైన దేవతామూర్తులు

గౌతమీనగర్ కాలనీలో భక్తి శ్రద్ధలతో వేడుక

అశ్వాపురం: భారజల కర్మాగార అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో ఆదివారం జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మణుగూరు భారజల కర్మాగారం జీఎం ఎస్.జగ్గారావు యాత్రను ప్రారంభించగా, తొలిరోజు వేడుకగా అంగరంగ వైభవంగా సాగింది. ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రను తలపించేలా ఏటా ఇక్కడ రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కర్మాగారంలోని ఒడిశా అధికారులు, ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యంలో రథయాత్రను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతా మూర్తులకు తొలిరోజు ఆధ్యాపూజ, మధ్యాహ్న పూజ, పహాండి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీఎం ఛెరపహారా(చీపురుతో రథం శుభ్రం చేయుట) కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేళ కాలనీ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. జగన్నాథుడిని స్మరించుకుంటూ రథం లాగారు. ఆ తర్వాత గుండిచాఘర్ మందిరంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్రకు కాలనీ వాసులతోపాటు అశ్వాపురం పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా రథయాత్ర ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం అధికారులు, ఉత్కల్ పతాగర్ కమిటీ అధ్యక్షుడు అరుణ్‌మహాపాత్రా, కార్యదర్శి సరోజ్‌దాస్, సందీపన్‌సాహు, మదన్‌మోహన్‌సాహు, ఉద్యోగుల కటుంబీకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రతిభ చాటిన విద్యార్థినులు


ఎంపికైన సత్తుపల్లి విద్యార్థినులు

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పాఠశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మల్లెమడుగు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ బియ్యని కృష్ణయ్య తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో విద్యార్థినులు లతిక, అనిత, సంజనలు అత్యంత ప్రతిభ కనబరచడంతో పాఠశాల నుంచి ఇదే మొదటిసారి ఎంపిక అన్నారు. ఈమేరకు పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షుడు అలివేలు, కార్పొరేటర్లు నిరంజన్, లలిత, గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, సూర్యం, శ్రీనివాసరావు, బి.కృష్ణ, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన కె.ధనవర్ష, టి.ఉమాశ్రీ, పి.తనుశ్రీ, ఎస్.ఖ్యాతిలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కాగా, ఈ నెల 11, 12వ తేదీలలో మహబూబ్‌నగర్‌లో పోటీలు జరగనుండగా.. ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ జట్టు తరపున రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవిని, ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు అభినందించారు.

ఐదు గ్రామాల విలీనం ఆవశ్యకం..

- జల వివాదాలకు తావివ్వొద్దు
- తెలుగు రాష్ట్రాలు సమగ్రాభివృద్ధి చెందాలి
- ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీలో మంత్రి తుమ్మల


చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: భద్రాచలం నుంచి విడిపోయిన ఐదు గ్రామాలు తెలంగాణలో విలీనం కావాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్ర సీఎం చంద్రబాబునాయుడుకు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన తుమ్మల పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. రెండు రాష్ట్రాలకు మేలు చేకూర్చే జాతీయ రహదారులు, జల వనరులు, రైల్వేలైన్లపై చర్చించారు. సత్తుపల్లి నుంచి కోవూరు రైల్వేలైన్ పనులు పూర్తయితే ఇరు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని, బొగ్గు రవాణాతో పాటు ఇరు రాష్ట్రాల్లో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను భక్తులు సందర్శించే వీలు కలుగుతుందని తుమ్మల వివరించారు. అంతేకాక జలవివాదాలు లేకుండా ఇరు రాష్ట్రాలకు మేలు జరిగేలా పట్టిసీమ నుంచి పులిచింతల లింక్‌తో శ్రీశైలం నీళ్లతో రాయలసీమకు సాగునీటి కష్టాలు తీరడంతో పాటుగా తెలంగాణకు సైతం మేలు జరుగుతుందన్నారు. ఇరు రాష్ట్రాలు విడిపోయినా..అభివృద్ధిలో అన్నదమ్ముల్లా కలిసి ముందుకుసాగాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. చంద్రబాబుతో భేటీ అప్యాయంగా కొనసాగిందని మంత్రి తుమ్మల తెలిపారు.

మండ్రాజుపల్లిలో ఉద్రిక్తత..!

- రహదారిని తవ్వుతుండగా పనులను అడ్డుకున్న తండావాసులు


పనులను అడ్డుకుంటున్న తండావాసులు

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లి పంచాయతీలో తండా రహదారిని ఆక్రమించి మట్టి తవ్వుతున్నారని తండావాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. సదరు రైతు జేసీబీ తో రహదారిని తవ్వుతుండగా.. తండావాసులంతా తాము రాకపోకలు ఎలా సాగించేదంటూ పనులను అడ్డుకున్నారు. ఈక్రమంలో రైతు కుటుంబానికి తండావాసులకు వాగ్వాదం జరగడంతో పాటు జేసీబీని అక్కడ నుంచి పంపించే వరకు అక్కడ నుంచి కదలలేదు. దాదాపు రెండు గంటల తరువాత జేసీబీని పంపించడంతో తండావాసులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

సీత్లా పండుగపై విస్తృత ప్రచారం చేయాలి


ఐక్యతను తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: గోర్ బంజారాల పవిత్రమైన పండుగ సీత్లా అని, బంజారాలంతా ఒకే రోజున రేపు(మంగళవారం) రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకోవాలని గోర్ బంజారా ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శోభన్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బంజారా భవన్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.లచ్చు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగను ఒకే రోజు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని, సెలవు కూడా లభించే అవకాశం ఉన్నందున ఉద్యోగ, బంజారా ప్రతినిధులు ప్రత్యక్షంగా, పరోక్షంగా, సోషల్ మీడియా వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు ధరావత్ రాములునాయక్, బి.కోటేశ్వరరావు, దేవులానాయక్, బానోత్ శ్రీధర్‌నాయక్, బి.మంగ్యానాయక్, బి.కెన్నానాయక్, శంకర్ నాయక్, కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా నూతన చట్టాలు



సెమినార్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు అత్యంత దుర్మార్గమైనవని, వ్యక్తిగత స్వేచ్ఛను హరించి వేస్తాయని ఐలూ రాష్ట్ర అధ్యక్షుడు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన 'మూడు క్రిమినల్ చట్టాల అమలు– పర్యవసానాలు–ప్రమాదాలు'అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో ఆయన మాట్లాడారు. మూడు చట్టాలున్నా శిక్షను పదేళ్లకు పొడిగించడం సమంజసం కాదని, ఈ చట్టాల మార్పు వెనుక మొత్తం రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర దాగుందన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా, వ్యక్తిగత ప్రైవసీ హరించేలా చట్టం చేశారన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పార్లమెంట్, న్యాయవాదులతో ఎలాంటి చర్చ లేకుండా కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చారన్నారు. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఈ మూడు చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే అధికారం పోలీసులకు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సెమినార్‌లో ఐలూ రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, జిల్లా బార్ కౌన్సిల్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలూ జిల్లా కార్యదర్శి నల్లమల నవీన్ చైతన్య, రాష్ట్ర నాయకులు మీసాల వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం..

రూ.26లక్షల స్కూల్ గ్రాంట్ నిధులు స్వాహా



ఖమ్మం సహకారనగర్: ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి తన చేతివాటం ప్రదర్శించి రూ.26లక్షలను స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యాశాఖలోని బి.రామకృష్ణ అనే ఉద్యోగి కాంట్రాక్ట్ పద్ధతిలో సుమారు 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్కూల్ గ్రాంట్ కింద కారేపల్లి మోడల్ స్కూల్‌కు రూ.26లక్షల నిధులు విడుదల కాగా.. విద్యాశాఖ కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ సుమారు నెల రోజుల క్రితం ఆ నిధులను స్వాహా చేసినట్లు విద్యాశాఖాధికారులు శనివారం గుర్తించారు. కాగా, పూర్తిస్థాయిలో స్కూల్ గ్రాంట్స్ నిధుల వివరాలను పరిశీలిస్తే ఇంకొన్ని సంఘటనలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ బాధ్యులు చెబుతున్నారు.

తేలిందిలా..

ప్రభుత్వ పాఠశాలలకు ఏటా స్కూల్ గ్రాంట్ నిధులు విడుదల చేస్తోంది. ఈ క్రమంలో కారేపల్లి మోడల్ స్కూల్‌కు రూ.26లక్షల నిధులు విడుదల కాగా.. వాటిని డ్రా చేసేందుకు ఎస్ఎంసీ చైర్మన్‌తో కలిసి ప్రిన్సిపాల్ నిర్ణయించారు. ఈక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిధుల విషయమై ప్రింట్ పేమెంట్ అడ్వయిజర్ (పీపీఏ)ద్వారా పరిశీలించగా.. నిధులు డ్రా అయినట్లు తేలింది. దీంతో డీఈఓ సోమశేఖర శర్మను సంబంధిత ప్రిన్సిపాల్ సంప్రదించగా.. డీఈఓ విచారణ చేపట్టడంతో సంబంధిత ఉద్యోగి నిధులను తాను వినియోగించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు.

విషయం కలెక్టర్ దృష్టికి..

నిధులు స్వాహా విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సూచనల మేరకు శనివారం రాత్రి నగరంలోని త్రీటౌన్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైనట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఇదిలా ఉండగా ఇందుకు సంబంధించిన విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉద్యోగులైన నాగేశ్వరరావు, హారిక, విప్లవ్‌కుమార్‌లకు షోకాజ్ నోటీసులిచ్చినట్లు తెలిపారు.

టర్మినెట్ చేసేలా...?

జిల్లాలో ఒక పాఠశాలకు సంబంధించి నిధులు స్వాహా చేసిన సంఘటనపై రామకృష్ణను టర్మినేట్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కలెక్టర్‌కు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు సైతం జరిగిన సంఘటనను తెలియచేసినట్లు డీఈఓ తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్ట్ విధానంపై కినుక

- కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థలో పనుల నిర్వహణకు నూతనంగా తీసుకొచ్చిన కాంట్రాక్ట్ విధానంపై కిందిస్థాయి కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ పనులను క్లాస్–1 కాంట్రాక్టర్లకు అప్పగించాలని సంస్థ నిర్ణయించి, అందుకు తగిన విధివిధానాలను రూపొందించి అమలు చేస్తోంది. రెండేళ్ల ఆపైన రూ.20 లక్షల కాంట్రాక్ట్ పనులు నిర్వహించిన క్లాస్–1 కాంట్రాక్టర్లను విద్యుత్ పనులకు ఎంపిక చేయాలని సంస్థ నిర్ణయించి ఆదేశాలు జారీ చేయడంతో టీజీ ఎన్పీడీసీఎల్ ఇటీవల సర్కిళ్ల వారీగా టెండర్ విధానంలో క్లాస్–1 కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ చేపట్టింది. గతంలో క్లాస్–1 కాంట్రాక్టర్లతో పాటు క్లాస్–2, 3 కాంట్రాక్టర్లకు విద్యుత్ కాంట్రాక్ట్ పనులను అప్పగించి చేయించేవారు. ఆ స్థానంలో కేవలం క్లాస్–1 కాంట్రాక్టర్లకు మాత్రమే అవకాశం కల్పించడంతో క్లాస్–2, 3 కాంట్రాక్టర్లు తాము ఉపాధి కోల్పోతున్నామని పేర్కొంటూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు విద్యుత్ సంస్థ కాంట్రాక్ట్ పనుల నుంచి క్లాస్–2, 3 కాంట్రాక్టర్లను ఎందుకు తప్పించిందని, కారణాలను తెలపాలని సంస్థను కోరినట్లు సమాచారం. ఆ విషయం తేలిన తరువాతేనూతన విధానాన్ని అమలు చేయాలని కోర్టు సంస్థను ఆదేశించినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఖమ్మం విద్యుత్ సర్కిల్ పరిధిలో 23 సబ్ డివిజన్ల పరిధిలో 45 సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో కాంట్రాక్ట్ పనులకు క్లాస్–1 కాంట్రాక్టర్ల నుంచి 133 దరఖాస్తులు అందగా.. సంస్థ అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. అయితే కోర్టు నుంచి తమ శాఖకు ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు అందలేదని, ఎన్పీడీసీఎల్ ఆదేశాల మేరకు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని సంస్థ అధికారులు చెబుతున్నారు. కాంట్రాక్ట్ పనుల్లో తమను కొనసాగించాలని క్లాస్–2, 3 కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


సాయికృష్ణ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న జాలరులు (ఇన్‌సెట్) సాయికృష్ణ (ఫైల్ ఫొటో)

బోనకల్: బోనకల్ గ్రామానికి చెందిన గుదిమళ్ల సాయికృష్ణ (14)నాగులవంచ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కావడంతో వారి బంధువులు ఉప్పలమ్మ తల్లి కార్యక్రమం ఉందని చిరునోముల గ్రామానికి తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం పక్కనే ఉన్న ఎన్టీఆర్ జిల్లా పోలంపల్లి గ్రామంలో గల మున్నేరు డ్యామ్ వద్దకు తన స్నేహితులు ఐదుగురితో కలిసి ఈతకు వెళ్లాడు. డ్యామ్‌లో ఈత కొడుతుండగా.. ఇద్దరు చాలా లోతుకు వెళ్లి కేకలు పెడుతుండడంతో దగ్గరలో ఉన్న జాలరులు ఒకరిని కాపాడగా సాయికృష్ణ మృతి చెందాడు. గుదిమళ్ల గోపాల్‌రావు, రమాదేవిలకు ఏకైక కుమారుడు కావడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి

- ఏపీ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు
- ఇడుపులపాయలో నివాళులర్పించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. రక్తదానం, పేదలకు వస్త్రాల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ, రహదారుల పక్కన మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశాయి. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

అండగా ఉంటాం.. ఆందోళనొద్దు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం జగన్
- దుర్మార్గ సంప్రదాయానికి టీడీపీ బీజం వేస్తోంది
- హామీలను విస్మరించి దాడులను ప్రోత్సహిస్తోంది
- అధైర్య పడొద్దు.. బాధితులందరినీ కలుస్తా
- టీడీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందాం
- మన కాలం వస్తుంది.. ఓపిగ్గా ఉండండి



వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: 'టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దాడులు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. ఇలా ఐదేళ్లలో మనం ఎప్పుడూ దౌర్జన్యాలు చేయ లేదు' అంటూ అనంతపురం జిల్లాకు చెందిన బాధితులు వాపోతుంటే, అధైర్య పడొద్దని.. టీడీపీ దుర్మార్గాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. 'మీ ప్రాంతానికి వస్తా.. మీకు అండగా నిలుస్తా.. ఆందోళన పడొద్దు, అందర్నీ కలుస్తా.. టీడీపీ దుర్మార్గాన్ని దీటుగా ఎదుర్కొందాం' అని ఊరడించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు, నాయకులతో ఆయన మమేకమయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, వీరాంజనేయులు, మగ్బూల్ బాషా, సాంబశివారెడ్డి తదితరులు వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం ఆ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ 'పోరాటాలు మనకు కొత్త కాదు. పోరాటం నుంచే పుట్టిన పార్టీ మనది. ఎంతో కాలం టీడీపీ దౌర్జన్యాలు నడవవు. మనోధైర్యం కోల్పోవద్దు. పార్టీ శ్రేణులకు అండగా ఉండండి. టీడీపీ బాధితులను నేను స్వయంగా కలుస్తా. అండగా నిలుస్తా. టీడీపీ దౌర్జన్యాలను సహించేది లేదు. మనందరం కలసికట్టుగా ఎదుర్కొందాం. మన కాలం వస్తోంది. అంత వరకూ కేడర్‌కు భరోసా ఇవ్వాలి' అని ఆయన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

హామీలను విస్మరించి దాడులకు ప్రోత్సాహం

'ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, చంద్రబాబు సర్కార్ వైఎస్సార్‌సీపీ కేడర్‌ను టార్గెట్ చేసి దాడులను ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. టీడీపీ సర్కార్ వ్యక్తిగత దాడులకు ఉసిగొల్పుతోంది. ప్రజలన్నీ గమనిస్తున్నారు. ధైర్యంగా ఉండండి. పార్టీ తరుపున అండగా ఉంటాం' అని మాజీ ఎమ్మెల్యేలు ఎస్ రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఇదివరకెన్నడూ లేని రీతిలో దుర్మార్గ సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే ఫలితం అనుభవించక తప్పదన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ లింగాల మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి సతీమణీ లక్ష్మినరసమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో వైఎస్ జగన్ ఆదివారం పెద్దకూడాల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులందర్నీ పలుకరించి, ధైర్యం చెప్పారు. లింగాల మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన నాయకుల్ని పేరుపేరునా పలుకరించారు. పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మబ్బు రామయ్య తన పట్టా భూమిలో దౌర్జన్యంగా టీడీపీ వర్గీయులు రోడ్డు వేస్తున్నారని వాపోయారు. అడ్డుకున్న తనపైనే తప్పుడు కేసు బనాయిస్తున్నారని వివరించారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. బాధితుడికి అన్యాయం చేయొద్దని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు ఓపికగా విన్నారు. అవసరమైన చర్యలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కే సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవట్లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు.. సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థల్లో అరకొర వసతులు, టీచర్లకు, పాఠ్యపుస్తకాలకు, దుస్తులకు, తాగునీటికి కొరత ఏర్పడిందని.. వేతనాల చెల్లింపు ఆలస్యం వంటి సమస్యలు విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్ రాజకీయ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టట్లేదని హరీశ్‌రావు లేఖలో విమర్శించారు.

ముక్కిపోయిన బియ్యంతో విద్యార్థులకు భోజనామా?

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు–మన బడి'అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తే దాన్ని కొనసాగించకుండా సీఎం నిర్లక్ష్యం చేస్తున్నారని హరీశ్‌రావు తప్పుబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు సన్నబియ్యానికి బదులు ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల పౌష్టికాహారం కోసం అందించే కోడి గుడ్ల బిల్లులు సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దనే మనవతా దక్పథంతో 27 వేల పాఠశాలల్లో తమ హయాంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించడాన్ని తప్పుబట్టారు. మొత్తంగా కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందని హరీశ్ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాల విద్యను గాడినపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని బహిరంగ లేఖలో హరీశ్ డిమాండ్ చేశారు.

సీఎంకు బహిరంగ లేఖలో హరీశ్ ప్రస్తావించిన పలు డిమాండ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న 54,201 మంది కుక్ కమ్ హెల్పర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి.
- ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలి.
- ఎస్జీటీల బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడ్డ సుమారు 9 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తామన్న సిబ్బందిని నియమించాలి.
- విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించాలి.
- 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని పునఃప్రారంభించాలి.
- సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ 4 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

వైఎస్సార్ మహోన్నత నాయకుడు

- ఆయన స్మృతిపై రోజూ విచారిస్తూనే ఉన్నాం: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ



సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిజమైన దేశభక్తుడని, మహోన్నత నాయకుడని ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ కొనియాడారు. మహానేత వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఆదివారం ఓ సందేశం విడుదల చేశారు. 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భారతదేశ మహోన్నత నాయకుడు. దేశానికి, రాష్ట్రానికి, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా, అంకితభావంతో సేవ చేసిన నిజమైన దేశభక్తుడు. మంచి వ్యక్తిగా, విలువలు ఉన్న సహచరుడిగా వైఎస్సార్ పట్ల మాకు అత్యంత గౌరవం ఉంది. పార్టీ కోసం కలిసి పనిచేసిన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నా. ప్రజలకు గొప్ప సేవ చేసిన ఆ మహానేత లేరని మనమంతా ప్రతిరోజూ విచారిస్తూనే ఉన్నాం. వైఎస్సార్ దార్శనికత, మార్గదర్శకత్వం నుంచి స్ఫూర్తి పొందుదాం. వైఎస్సార్ జ్ఞాపకాలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గౌరవిస్తోంది. గొప్ప ప్రజా సేవకు బాటలు వేసిన వైఎస్సార్‌కు 75వ జయంతి సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నా' అని సోనియాగాంధీ పేర్కొన్నారు.

ఆ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేను

టీపీసీసీ అధ్యక్షుడిగా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఆదివారంతో మూడు వసంతాలు పూర్తయ్యాయి. నాడు నాపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సోనియాగాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలందరికీ కృతజ్ఞతలు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం, సోనియాగాంధీ సారథ్యంలో విజయభేరీ సభ నిర్వహించడం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం... మూడేళ్లలో ఈ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేని సందర్భాలు. ఈ ప్రస్థానంలో నాకు సహకరించిన పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధికారంలోకి రావడానికి కఠోర శ్రమ చేసిన లక్షలాది మంది కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాపాలనకు నాంది పలికిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.' అని ఆ ట్వీట్‌లో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అర్ధరాత్రి ఇండోర్ స్టేడియం కూల్చివేత

పుంగనూరులో కూటమి నేతల పైశాచిక ఆనందం

- హిటాచీలు, జేసీబీలతో విధ్వంసం
- దాదాపు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం
- కులమతాలు, పార్టీలకు అతీతంగా నిర్మించిన స్టేడియం కూల్చివేతపై జనాగ్రహం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాం

హరీశ్‌రావు లేఖపై విద్యాశాఖ స్పందన

హైదరాబాద్: మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించి గత డిసెంబర్ నాటికి ఉన్న రూ. 50 కోట్ల బకాయిలతోపాటు అదనంగా రూ. 50.45 కోట్లను విడుదల చేసినట్లు విద్యా శాఖ స్పష్టం చేసింది. మరో రూ. 53.07 కోట్లు త్వరలోనే విడుదల కానున్నాయని పేర్కొంది. విద్యా శాఖ సమస్యలపై స్పందించాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన లేఖకు ఈ మేరకు స్పందించింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మొత్తం 26 వేల పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులందరికీ ఒక జత యూనిఫాం అందజేశామని, రెండో జత యూనిఫాం ఈ నెలాఖరుకు అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకుండానే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిందని, అయినప్పటికీ మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న సీఎం బ్రేక్ ఫాస్ట్ బకాయిలు రూ.3.5 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించింది.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంచుతామన్నారు.

టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఫైనల్ కీ కూడా

జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫైనల్ కీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఫైనల్ కీలో 2 ప్రశ్నలను(56, 59) తొలగించారు. 17వ ప్రశ్నకు సమాధానాన్ని 1 అలాగే 3 ఆప్షన్ ఎంచుకున్న వారికి మార్కులు ఇచ్చారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఈ పరీక్ష నిర్వహించిన కమిషన్.. ప్రిలిమినరీ కీతోపాటు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను అభ్య ర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. ఆ తర్వాత అభ్యర్థులనుంచి అభ్యంతరాలు స్వీకరించిన కమిషన్ విషయ నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి వారితో చర్చించి తుది కీని తయారుచేసింది. ఈ కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టినట్లు కమిషన్ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల స్కాన్డ్ ఓఎంఆర్ పత్రాలు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

జిల్లా వార్తలు

రిటర్న్ టికెట్ రిజర్వేషన్‌పై 10 శాతం రాయితీ

ఖమ్మంమయూరిసెంటర్ : దూర ప్రాంతాలకు వెళ్లేందుకు టీజీఎస్ ఆర్టీసీ బస్సులో టికెట్ రిజర్వేషన్ చేయించుకునే ప్రయాణికులు అదే సమయంలో రిటర్న్ జర్నీ టికెట్‌ను రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఖమ్మం ఆర్ఎం సరిరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బస్టాండ్‌ల నుంచి హైదరాబాద్, బెంగళూర్, శ్రీశైలం, తిరుపతి, శ్రీకాకుళం, విశాఖపట్టణం రూట్లలో ప్రయాణించే వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని, లహరి సర్వీసుల్లో టికెట్ బుక్ చేసుకునే సమయంలో రిటర్న్ జర్నీ టికెట్‌ను బుక్ చేసుకుంటే ఈ రాయితీ వర్తిస్తుందని, బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లలో, ఏటీబీ కౌంటర్లు, వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు



తృతీయస్థానంలో నిలిచిన ఖమ్మం పురుషుల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. పురుషుల ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు నిలవగా, రెండో స్థానంలో రంగారెడ్డి, మూడోస్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయి. మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు దక్కించుకున్నాయి. దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, జోసెఫ్ జార్జి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్. మనోజ్‌కుమార్, సుజిత్‌కుమార్, రమేష్‌బాబు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆషాఢం.. ఆధ్యాత్మికం



ఇల్లెందులోని పెద్దమ్మతల్లి ఆలయం (ఇన్‌సెట్) కొలువుదీరిన పెద్దమ్మతల్లి

- నెలంతా పూజలు, బోనాల సందడి
- ఆలయాల్లో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు
- అమ్మవార్లకు బోనాలతో సంబురాలు

ఇల్లెందురూరల్/కొత్తగూడెంటౌన్: శుభకార్యాలకు అవకాశం లేకపోయినా.. ఆషాఢ మాసం ఆధ్యాత్మిక ప్రత్యేకతలకు నెలవు. ఎన్నో ప్రత్యేకతలు దాగి ఉన్న మాసమిది. చంద్రుడు పూర్వాషాఢ నక్షత్రం సమీపంలో సంచరించే సమయం కావడంతో ఆషాఢంగా పిలుస్తారని పురోహితులు చెబుతున్నారు. ఈ నెలంతా వివాహాలు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలకు ప్రాధాన్యత ఇవ్వరు. అయినా ఇంటింటా పూజలు జరుపుకోవడం మాత్రం ఆనవాయితీగా వస్తోంది. వివిధ పర్వదినాలకు నెలవైన ఆషాఢ మాసం ఇటీవలే ప్రారంభం కాగా, ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనున్న సందర్భంగా కథనం.

పూజలకు పవిత్రమైనది

ఆషాఢ.. ఆది అనే సంస్కృత పదం నుంచి వచ్చింది. ఆది అంటే శక్తి అని అర్థం. అందుకే ఆషాఢ మాసం దేవతలను పూజించడానికి చాలా పవిత్రమైనది. ఈనెలలో పవిత్రమైన పూజలు, వ్రతాలు, రథ యాత్రలు, పల్లకీ సేవలకు శుభప్రదం. అందుకే ఆలయాలు ప్రత్యేక సేవలు, భక్తుల సందడితో కిటకిటలాడుతాయి. వేదపండితులు నిత్యం పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు.

బోనాల పండుగ

ఆషాఢ మాసంలో సమాజ శ్రేయస్సు కోసం గ్రామ దేవతలను పూజించడం ప్రధానంగా కనిపిస్తుంది. అందులో ముఖ్యమైనది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విశిష్ట జానపదుల వేడుక బోనాల పండుగ. డప్పుల మోతలు, పోతురాజుల విన్యాసాలు, బోనాలతో తరలివచ్చే మహిళలు.. ఎటు చూసినా ఆధ్యాత్మిక సంబురమే. జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో మహిళలు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ దేవతలైన పెద్దమ్మతల్లి, పోచమ్మ, మైసమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో బోనాలతో మొక్కులు సమర్పిస్తారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి బహుళ అమావాస్య వరకు బోనాల వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.


17న ఆషాఢ ఏకాదశి

ఈ నెల 17వ తేదీన ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు చేస్తారు. ఉపవాస దీక్షలతో భగవంతుడిని పూజించడమే కాక రాత్రి జాగారం ఆచరిస్తారు. ఇదేరోజు నుంచి చాతుర్మాస వ్రతం ప్రారంభమవుతుంది. ఆషాఢ శుద్ధి ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ద్వాదశి వరకు నాలుగు నెలలపాటు వివిధ వ్రతాలు, పండుగలు జరుపుకుంటారు. ఇక గురువులను స్మరించుకునే గురు పూర్ణిమను ఈ నెల 21న నిర్వహిస్తారు. భగవంతుడే వేదవ్యాసుడిగా అవతరించి అనంతమైన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి ఈ లోకానికి అందించినట్లు పురోహితులు చెబుతారు. అందుకే వేద వ్యాసుడు, దత్తాత్రేయస్వామి, షిరిడీ సాయిబాబా, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో గురుపూర్ణిమను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అతివలు మెచ్చే గోరింటాకు

ఆషాఢ మాసంలో మహిళ చేతుల్లో గోరింటాకు మెరిసిపోతుంటుంది. తొలకరి వానలు పడే సమయాన గోరింటాకును చేతులు, కాళ్లకు పెట్టుకుంటే ఎలాంటి చర్మవ్యాధులు దరిచేరవనేది నమ్మకం. గోరింటాకులో ఉన్న ఔషధ గుణాలు శరీరంలో ఉన్న వేడిని తొలగించి చలువ అందిస్తాయి. ఈ మాసంలో పిల్లలు, పెద్దలు అందరూ గోరింటాకు అలంకరించుకుంటారు. ఇక కొత్తగా పెళ్లయిన వారు ఈనెలలో తల్లి గారింటికి చేరతారు.


ఆధ్యాత్మిక ఆనందాన్నిచ్చే మాసం



ఆషాఢంలో శుభకార్యాలు లేకున్నా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజలు ఆనందాన్ని పొందుతారు. గ్రామదేవతలను పూజించడం, నైవేద్యాలు సమర్పించడమే కాక పూజలు, వ్రతాలకు ప్రాధాన్యతనిస్తారు. ఔషధ గుణాలు కలిగిన గోరింటాకు చేతికి అద్దుకొని యువతులు మురిసిపోతారు.

–జిల్లోజు రామాచార్యులు, పురోహితుడు, కొమరారం, ఇల్లెందు మండలం

బోనాలను సమర్పిస్తే ఆయురారోగ్యం



అషాఢమాసంలో బోనాలకు ప్రాధాన్యత ఉంటుంది. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల అనారోగ్యం బారిన పడకుండా గ్రామదేవతలు, కులదేవతలు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. తద్వారా అమ్మవార్ల అనుగ్రహం పొందొచ్చు.

–అరుణానందస్వామి, రామవరం

బ్యాక్‌డౌన్‌లో విద్యుత్ యూనిట్లు



కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారం

- డిమాండ్ లేకపోవడంతో కేటీపీఎస్‌లో తగ్గిన ఉత్పత్తి
- 10వ యూనిట్‌లో మరమ్మతు పనులు

పాల్వంచ: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ తగ్గిన నేపథ్యంలో కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని యూనిట్లు బ్యాక్ డౌన్‌లో నడుస్తున్నాయి. రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ తగ్గిపోతుండగా, ఆ మేరకు ఉత్పత్తి తగ్గిస్తున్నారు. వర్షాల వల్ల వాతావరణం చల్లబడటంతోపాటు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం తగ్గింది. సోలార్, హైడల్ విద్యుత్ అధికంగా అందుబాటులోకి వస్తోంది. వీటితో పోల్చుకుంటే థర్మల్ విద్యుదుత్పత్తి యూనిట్ ధర కూడా ఎక్కువగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో థర్మల విద్యుదుత్పత్తి తగ్గించగా, కేటీపీఎస్‌లోని యూనిట్లు బ్యాక్‌డౌన్‌లో ఉంటున్నాయి. అవసరమైనప్పుడు పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం, మళ్లీ కొన్ని గంటల సమయంలోనే ఉత్పత్తిని తగ్గించడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలోని 9వ యూనిట్‌లో 250 మెగావాట్లకుగాను 170 మెగావాట్లు, 6వ దశలోని 11వ యూనిట్‌లో 500 మెగావాట్లకు 275 మెగావాట్ల ఉత్పత్తి చేస్తున్నారు. 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5వ దశలోని 10వ యూనిట్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా నెల రోజులుగా ఉత్పత్తిని నిలిపివేశారు. 7వ దశ కర్మాగారంలోని సూపర్ క్రిటికల్ సామర్థ్యం కలిగిన 12వ యూనిట్‌లో 800 మెగావాట్లకు గాను 770 మెగావాట్ల ఉత్పత్తి వస్తోంది. ఈ విషయమై సీఈ ఎం.ప్రభాకర్‌రావును వివరణ కోరగా.. డిమాండ్ లేకపోవడంతో యూనిట్లు బ్యాక్‌డౌన్‌లో నడుస్తున్నాయని తెలిపారు.

కిన్నెరసానికి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



కిన్నెరసానిలో పెరిగిన నీటిమట్టం (ఇన్‌సెట్) నీటిమట్టం సూచిక

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు వచ్చి చేరడంతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం పెరిగింది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌కు గుండాల ఆళ్లపల్లి ప్రాంతాల నుంచి 15 వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో నీటిమట్టం ఆదివారం 398.10 అడుగులకు పెరిగిందని డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు. కాగా, జలాశయం నుంచి 120 క్యూసెక్కుల నీరు బయటకు విడుదల చేస్తున్నారు.

– పాల్వంచరూరల్

బౌద్ధక్షేత్రం చరిత్రను అందరూ తెలుసుకోవాలి



బౌద్ధక్షేత్రం వద్ద విద్యార్థులతో నిజామాబాద్ ఇన్‌చార్జ్ ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి

నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

నేలకొండపల్లి : దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్దదైన నేలకొండపల్లి భౌద్ధక్షేత్రం చరిత్రను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని నిజామాబాద్ ఎక్సైజ్ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.సోమిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కుటుంబసమేతంగా బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. బౌద్ధక్షేత్ర చరిత్రను లిఖించిన బోర్డులను పరిశీలించారు. అదే సమయంలో సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్రకు రాగా, వారితో కలిసి ఆట, పాటలతో సందడి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బుద్ధుడు అహింసా మార్గాన్ని ఎంచుకున్నారని, ఆయన చూపిన బాటలో ప్రతీ ఒక్కరు నడవాలని సూచించారు. అనంతరం సిద్దార్థ యోగా విద్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, పీఈటీలు సౌజన్య, ఉదయ్, పాఠశాల వసతి గృహం అధికారి నాగాచారి తదితరులు పాల్గొన్నారు.